క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని వినతి



మంత్రి విశ్వరూప్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ

అమలాపురం టౌన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ కోరారు. అమలాపురంలోని క్యాంపు కార్యాలయంలో ఉన్న మంత్రి విశ్వరూప్‌ను ఎమ్మెల్సీ శుక్రవారం సాయంత్రం కలిసి ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రం అందించారు. నాలుగు అంశాలతో కూడిన ఉద్యోగుల సమస్యలను వివరించారు. ప్రజల అవసరాల కోసం అదనపు బస్సులను నడిపాలని కోరారు. పలు అంశాలపై మంత్రి విశ్వరూప్‌తో ఆయన చర్చించారు.

కబడ్డీ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన దీపిక, వెన్నెల

తాళ్లరేవు: చిత్తూరు జిల్లా నగరిలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకూ జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు పటవల హైస్కూల్‌లో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు ఎంపికై నట్లు స్కూల్ పీడీ వి.మాచరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్–14 విభాగంలో ఆడేందుకు మేడిశెట్టి దీపిక, ఆకుల వెన్నెల ఎంపికైనట్లు వివరించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై న విద్యార్థినులతో పాటు వారి ఎంపికకు కారణమైన పీడీ మాచరరావును స్కూల్ హెచ్ఎం సీహెచ్ కాశీ విశ్వనాథమ్, ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు టొమ్మేటి సామ్యూల్ సాగర్, విద్యా కమిటీ చైర్మన్ నరాల శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

నులి పురుగులతో అనర్థాలు



విద్యార్థికి నులి పురుగు నివారణ మందును వేస్తున్న జీజీహెచ్ డీడీ రవిశంకర్

యానాం: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీజీహెచ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రవిశంకర్ మాట్లాడుతూ నులి పురుగులతో కలిగే అనర్థాలు, అనారోగ్య సమస్యలను వివరించారు. నులి పురుగులు మన శరీరంలోని పోషకాలను గ్రహించి అభివృద్ధి చెందే పరాన్నజీవులన్నారు. వీటివల్ల రక్తహీనత, పోషకాహార లోపం, బలహీనత, కడుపునొప్పి, వికారం తదితర సమస్యలు వస్తాయన్నారు. అనంతరం ఒకటి నుంచి 19 ఏళ్ల వరకూ పిల్లలకు, విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీజీహెచ్ నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కుంకుమ పూజలు



శ్రీదేవి అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తున్న పండితులు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి తల్లి ఆలయంలో అమ్మవారి జన్మదిన వార్షిక మహోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మూడో రోజు శుక్రవారం కుంకుమ పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ అమ్మవారికి 11 మంది వేద పండితులు ఈ క్రతువులను కనుల పండువగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ భళ్లమూడి దివాకరశాస్త్రి, ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్లకూరి సత్య సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో ఈ హోమాలు, కుంకుమ పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

సీపీఐ ధర్నా

అమలాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు అందని ద్రాక్షగానే ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు అన్నారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ స్థానిక డివిజన్ తపాలా కార్యాలయం ఎదుట ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా జరిగింది. సత్తిబాబు మాట్లాడుతూ గత ఏడాది బడ్జెట్ కంటే తాజా బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి నిధులు తక్కువ కేటాయించడమే ఇందుకు ఉదాహరణ అని అన్నారు. ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వాసంశెట్టి సత్తిరాజు, నాయకుడు శీలం వెంకటేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా.. అర్థమయ్యేలా..

- విపత్తుల నివారణపై అవగాహన
- మాక్‌డ్రిల్‌తో యానాం ప్రజల్లో చైతన్యం



విపత్తుల దళ సిబ్బందికి సూచనలు ఇస్తున్న అధికారులు



నీటిలో మునిగిపోయిన వ్యక్తిని కాపాడే విధానాన్ని వివరిస్తూ..

యానాం: ఒకవైపు అగ్నిమాపక శకటాల మోత.. మరోవైపు అంబులెన్స్‌ల కూత.. ఇంకోపక్క పోలీసులు, అధికారుల ఉరుకులు, పరుగులు.. విపత్తుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు యానాంలో ఇలా మాక్‌డ్రిల్ నిర్వహించారు. విపత్తుల సమయంలో ఎలా వ్యవహరించాలో అర్థమయ్యేలా వివరిస్తూ చైతన్యం నింపారు. యానాం ఇందిరాగాంధీ మార్కెట్ కాంప్లెక్స్ బేస్ క్యాంప్‌గా నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఆదేశాల మేరకు శుక్రవారం నిర్వహించిన ప్రకృతి విపత్తుల నిర్వహణ ప్రణాళిక మాక్‌డ్రిల్ విజయవంతమైంది. ప్రజలను ఆలోచింపజేసింది. తుపాన్‌లు, వరదలు వంటి విపత్తులు సంభవించినప్పుడు వాటిని తట్టుకుని ప్రాణ నష్టాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఈ మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఇందులో పోలీసు, అగ్నిమాపక దళం, వైద్యశాఖ, విద్యుత్, ఎన్‌డీఆర్‌ఎఫ్, రెవెన్యూ, మున్సిపాలిటీ, పీడబ్ల్యూడీ, ఎన్‌సీసీ తదితర శాఖలు పాల్గొన్నాయి. విపత్తులను ఆయా శాఖల సమన్వయంతో ఏ విధంగా ఎదుర్కోవాలో వివరిస్తూ నిర్వహించిన మాక్‌డ్రిల్ అందరినీ ఆకట్టుకుంది. ఈ మాక్‌డ్రిల్‌లో భాగంగా.. ముందుగా వాతావరణ శాఖ నుంచి అందిన సమాచారం మేరకు అత్యవసర శాఖల అధికారులు, సిబ్బంది తమ వాహనాలతో స్థానిక ఇందిరాగాంధీ మార్కెట్ కాంప్లెక్స్‌కు తరలివచ్చారు. అక్కడ రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి, ఎస్పీ రఘునాయగం సూచనల మేరకు బాధితులను తీసుకురావడానికి గోదావరి తీరానికి వెళ్లారు. అక్కడ నుంచి బాధితులను పునరావాస కేంద్రాలకు, గాయపడిన క్షతగాత్రులను జీజీహెచ్, స్థానిక ఎంజీజీబీహెచ్ హైస్కూల్‌లోని పునరావాస శిబిరాలకు తరలించారు. మార్గమధ్యంలో పడిన భారీ చెట్ల కొమ్మలను ఫైర్ సిబ్బంది, పోలీసులు తొలగించారు. పడిన విద్యుత్తు స్తంభాలను ఆ శాఖ సిబ్బంది తొలగించినట్లు చేసి చూపించారు. అప్రమత్తతపై ప్రజలకు హ్యాండ్ మైక్ ద్వారా సూచనలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఇలా వాహనాలు, అంబులెన్స్‌లు, పోలీసులు, అధికారుల ఉరుకులు పరుగులతో ప్రజలకు వివరించారు. ఈ మాక్‌డ్రిల్‌లో సీఐ గూటం శివగణేష్, ఎస్ఐ శేరు నూకరాజు, డీటీ సత్యనారాయణన్, ఏఈ లంక కృష్ణారావు, జీజీహెచ్ డీడీ రవిశంకర్, అగ్నిమాపక స్టేషన్ ఇన్‌చార్జి గంగరాజు, కమిషనర్ కె.రామకృష్ణ పాల్గొన్నారు.



రోడ్డుపై అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తూ..

వైభవం.. విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



పోలేకుర్రులో కోదండ రామాలయ ప్రతిష్ఠా మహోత్సవాల్లో గోపూజ చేస్తున్న భక్తులు



కర్రివానిరేవులో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్ తదితరులు

ముమ్మిడివరం: కర్రివానిరేవులో అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో సుమారు రూ.20 లక్షలతో నిర్మించిన శ్రీవిజయదుర్గమ్మ వారి ఆలయ పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో బ్రహ్మశ్రీ కాళ్లకూరి కామేశ్వరశర్మ మంత్రోచ్చరణల మధ్య పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, ఎంపీపీ కోలా గంగాభవానీ, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకరరావు, కోలా బాబ్జీ, సర్పంచ్ కాశి భాగ్యలక్ష్మి, మల్లాడి సత్తిబాబు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

తాళ్లరేవు: పోలేకుర్రులో కోదండ రామస్వామివారి ఆలయ పునః ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. వేద పండితుడు ఏలూరిపాటి ప్రభాకర శర్మ ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధన్, యాగశాల ప్రవేశం, అంకురార్పణ, ధ్వజారోహణ, గోపూజ, హోమాలు, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పోలేకుర్రుకు చెందిన పోతుల సత్యనారాయణమ్మ, దివంగత లత్సయ్య కుమారులచే ఆయా పూజలు జరిగాయి. శనివారం ఉదయం 8.43 గంటలకు స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, మధ్యాహ్నం అన్నసమారాధన ఉంటుందని పోలేకుర్రు రామాలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పంట నమోదు పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి ప్రశాంతకుమార్

ముమ్మిడివరం: రబీ రైతులు పంట నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంతకుమార్ సూచించారు. ముమ్మిడివరం వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. మండలంలో 6,893 ఎకరాలలో రబీ పంట వేశారన్నారు. ఇందులో 4,480 ఎకరాలలో పంట నమోదు ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన ఎకరాలలో ఈ నెల 15లోగా రైతులు నమోదును పూర్తి చేయించుకోవాలన్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ, పంట ఉత్పత్తుల కొనుగోలు, పంట నష్టం, పంటల బీమా, రుణాలు వంటివి పథకాలు పొందాలంటే ఇది తప్పనిసరి అన్నారు. మండలంలో శివారు భూములకు నీటి ఎద్దడి లేకుండా వంతుల వారీగా నీటి సరఫరా చేస్తున్నామన్నారు. సమావేశంలో వివిధ శాఖాధికారులు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

అల్లవరంలో..

అల్లవరం: ఈ–పంట నమోదును 15వ తేదీలోగా పూర్తి చేయాలని అమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎంఏ షంషీ అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఉండ్రు సుదర్శన్ రావు అధ్యక్షతన మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు మాట్లాడుతూ శివారు భూములకు నీటి ఎద్దడి రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. మండల వ్యవసాయ అధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ, తహసీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్, పశు సంవర్ధక శాఖ అధికారి ఎస్.నారాయణ, మత్స్య శాఖ అధికారి బి.హేమానంద్, డ్రైన్ ఏఈ కె.సునీత, వీఆర్వో ఆర్.రెడ్డి పాల్గొన్నారు.

నవగ్రహ నక్షత్ర పూజలు



విలసవిల్లిలో మున్సిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణికి తీర్థం అందిస్తున్న పురోహితుడు



అమలాపురంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

ఉప్పలగుప్తం: విలసవిల్లిలో రామాలయం వద్ద జరుగుతున్న నవగ్రహ నక్షత్ర పూజల్లో అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి దంపతులు పాల్గొన్నారు. యాగకర్త మున్నంగి రామకృష్ణ శర్మ సౌరయాగం విశిష్టతను ఆమెకు వివరించి, నక్షత్ర సంబంధిత పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

14న విగ్రహ ప్రతిష్ఠ

యానాం: స్థానిక గోపాల్‌నగర్, రామరాజు గార్డెన్స్‌లో నిర్మించిన ధనలక్ష్మి కల్యాణలక్ష్మి అమ్మవారి ఆలయ శిఖర, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం 14న జరుగుతుందని ఆలయ ప్రతినిధులు తెలిపారు. ఆగమశాస్త్ర భాస్కర సుదర్శనం వెంకట జనార్దనాచార్యుల ఆధ్వర్యంలో చింతా వెంకటగణేష్, సీత, సాంబమూర్తి నాగరత్నకుమారి దంపతులచే జరుపుతామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి రావాలని కోరారు.

కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

అమలాపురం రూరల్: అమలాపురం గాంధీనగర్‌లో కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన రావూరి ఉదయభాస్కర్, యేగి గంగానాగేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో పండితులు పూజలు చేశారు. 200 మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన జరిగింది. ఈ ఏర్పాట్లను ఆలయ కమిటీ ప్రతినిధులు తిక్కిరెడ్డి ఆదినారాయణ, సలాది సత్యనారాయణ, వడనగన సత్యానందం, కోరసాల బాబి పర్యవేక్షించారు.

సుబ్బాలమ్మ దేవస్థానం చైర్మన్‌గా మల్లికార్జునరావు



అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ దేవత సుబ్బాలమ్మ దేవస్థానానికి ప్రభుత్వం నూతన ధర్మకర్తల మండలిని నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని ఈఓ బొక్కా వీర వెంకటేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సమక్షంలో దేవస్థానం ప్రాంగణంలో శనివారం ఉదయం 11 గంటలకు నూతన ధర్మకర్తల మండలికి అభినందన సభ జరుగుతుందన్నారు. దేవస్థానం నూతన చైర్మన్‌గా బిళ్ల మల్లికార్జునరావు, ధర్మకర్తలుగా అరిగెల చంద్రశేఖర్, చప్పిడి సతీష్‌కుమార్, పందిరి సత్య సుధాకర్, శింగంశెట్టి చంద్రకళ కనకదుర్గాలక్ష్మి, అయితాబత్తుల లక్ష్మి, అమలదాసు వెంకటలక్ష్మి నియమితులయ్యారు. వీరితో పాటు ఎక్స్‌అఫీషియో సభ్యునిగా గిత్తా శ్రీనివాస్ ఎంపికయ్యారు. నూతన కార్యవర్గాన్ని మంత్రి విశ్వరూప్‌తో పాటు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర తదితరులు అభినందించారు.

క్రీడాకారులకు ముగిసిన శిక్షణ



మహిళా క్రీడాకారులతో ఎస్‌కేబీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కుమార్‌శాస్త్రి, డీఎస్పీ విజయసారథి

అమలాపురం రూరల్: చండీఘడ్‌లోని పంజాబ్ యూనివర్సిటీలో ఈ నెల 13 నుంచి 16 వరకూ జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ సపక్‌తక్రా మహిళా చాంపియన్ షిప్ పోటీల్లో నన్నయ యూనివర్సిటీ జట్టు పాల్గొనుంది. ఈ విషయాన్ని అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌వీ కుమార్‌శాస్త్రి, ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్ తెలిపారు. ఈ జట్టులో వివిధ కళాశాలలకు చెందిన క్రీడాకారులు ఉండగా వారికి ఎస్‌కేబీఆర్ కళాశాలలో వారం రోజుల నుంచి కోచ్ యండ్రా గౌతమ్, క్రీడాకారుడు కేతా సాయిదుర్గా ప్రసాద్ శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ ముగింపు కార్యక్రమానికి విచ్చేసిన ఏఆర్ డీఎస్పీ విజయసారథి, ఎస్సైలు నరసింహమూర్తి, రమేష్, వీలీప్ చైతన్య ఆధ్వర్యంలో క్రీడాకారులకు కిట్లు అందజేశారు. ఆల్ ఇండియా పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని వారు ఆకాంక్షించారు.

నగదు చెక్కుల అందజేత

యానాం: యానాంలో పుదుచ్చేరి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో పనిచేసే ఉద్యోగుల పిల్లల విద్యకు అందించే నగదు సహాయాన్ని శుక్రవారం ఆర్ఏఓ మునిస్వామి అందజేశారు. స్థానిక ఆర్ఏఓ చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో వి.నవీన్, విత్తనాల శ్రీసాయిదుర్గ వెంకట సతీష్, కొల్లు మనోజ్‌కుమార్‌లకు నగదు చెక్కులు ఇచ్చారు.

క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

అమలాపురం రూరల్: అమలాపురం బాలయోగి స్టేడియంలో రెండు రోజుల పాటు జరిగే భాష్యం అంతర పాఠశాలల బాలుర క్రీడా పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో అమలాపురం, తాటిపాక, మలికిపురం, ముమ్మిడివరం, కొత్తపేట, రావులపాలెం, మండపేట భాష్యం విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలను జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల్లోనూ రాణించాలన్నారు. జోనల్ ఇన్‌చార్జ్ జీవీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మలాశ్రమం వార్షికోత్సవాలు ప్రారంభం



శ్రీధర నిర్మలాశ్రమం వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న పైడి కొండార్యులు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ బొడ్డు చిన వెంకటాయపాలెంలో శ్రీధర నిర్మలాశ్రమం 59వ వార్షికోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆశ్రమ ఉపాధ్యక్షుడు కొపనాతి బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలకు విశాఖపట్నం జిల్లాకు చెందిన కాజులూరు పైడి కొండార్యులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గురువుని మించిన దైవం లేదని అన్నారు. ఉదయం మేలుకొలుపు, గురు గీతాపారాయణ, నగర సంకీర్తన, పతాకావిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ఆశ్రమ వ్యవస్థాపకుడు సమరస నిర్మలానంద కొపనాతి గంగరాజాచార్యులు వారి 22వ వార్షికారాధన అనంతరం జరిగే వేదాంత వైజ్ఞానిక సభకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా గురువులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

కళేబరాలతో ఇబ్బంది



ఎస్.యానం తీర ప్రాంతంలో పర్యాటక విశ్రాంతి భవనం వద్ద వరాహ కళేబరం

ఉప్పలగుప్తం: తీర ప్రాంతం ఎస్.యానంలో అంతుచిక్కని వైరస్‌తో పందులు చనిపోతున్నాయి. వీటి కళేబరాలతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎస్.యానం సముద్ర తీరం తెల్లటి ఇసుకతో చూడటానికి ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. నిత్యం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పర్యాటకులు వచ్చి ఆనందంగా ఆడి పాడుతుంటారు. కుటుంబ సమేతంగా వచ్చి సరుగుడు తోటలో విందు భోజనాలు చేస్తుంటారు. ప్రస్తుతం వైరస్‌తో చనిపోయిన పందులు బీచ్‌లో ఎక్కడికక్కడే ఉండడంతో దుర్వాసన వస్తుంది. ఈ కళేబరాలు పర్యాటకులకు రోత పుట్టిస్తున్నాయి. వీటిని అక్కడ నుంచి తరలించి, శుభ్రం చేయించాలని పలువురు కోరుతున్నారు.

కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా కామన



ప్రభాకరరావుతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గౌతమ్

అమలాపురం టౌన్: స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా కామన ప్రభాకరరావు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ జిల్లా నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకు ముందు రాహుల్ గాంధీ చేపడుతున్న జోడో యాత్రకు మద్దతుగా స్థానిక గడియార స్తంభం సెంటరు నుంచి ప్రెస్‌క్లబ్ వరకూ పాదయాత్ర నిర్వహించారు. ఇందులో ఏపీసీసీ మరో వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏపీసీసీ అధికార ప్రతినిధి ముషిణి రామకృష్ణారావు, ఏపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ డాక్టర్ దేవరపల్లి రాజేంద్రబాబు, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి, పట్టణ, రూరల్ పార్టీ అధ్యక్షులు వంటెద్దు బాబి, కుడుపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఓఎన్జీసీ పరిహారంపై కృతజ్ఞతలు

యానాం: గోదావరిలో ఓఎన్జీసీ సంస్థ వేస్తున్న రెండో గ్యాస్ పైపులైన్ నిర్మాణంతో వేట నష్టపోతున్న యానాం ప్రాంత మత్స్యకారులకు నష్ట పరిహారాన్ని ఆంధ్రా ప్రాంతంలో ఇచ్చే విధంగా ఆదేశాలు ఇచ్చినందుకు ఎల్జీ తమిళిసై, ఎన్‌డీఏ ప్రభుత్వానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓఎన్జీసీ పరిహారం పంపిణీలో మధ్యవర్తుల జోక్యం లేకుండా పూర్తి పారదర్శకతతో ఆయా లబ్ధిదారులకు మంజూరు చేయాలని తాను చేసిన ఆమరణ నిరాహార దీక్షలో కోరానన్నారు. ఆ డిమాండ్‌ను నెరవేర్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

కొబ్బరి చెట్లు నరికిన వ్యక్తిపై కేసు

అయినవిల్లి: ఓ రైతు తోటలో కొబ్బరి మొక్కలు నరికేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. క్రాప గ్రామానికి చెందిన చింతా వెంకటేశ్వరరావుకు చెందిన కొబ్బరి తోటలో మేడిపల్లి ప్రదీప్‌కుమార్ 32 కొబ్బరి చెట్లు నరికేశాడని అయినవిల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దేవస్థానం కమిటీని రద్దు చేస్తూ ఉత్తర్వులు

యానాం: యానాంలో కొలువైన శ్రీభూ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీని తాత్కాలికంగా రద్దు చేస్తూ శుక్రవారం మద్రాసు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. 18 ఏళ్లుగా కమిటీ పాలకవర్గంలో వేరొకరికి అవకాశం ఇవ్వకుండా ఒకే కమిటీ ఉండటంతో స్థానికులు కొందరు మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో విచారణ చేసి ప్రస్తుత కమిటీని తాత్కాలికంగా రద్దుచేసి దేవస్థానం పూర్తి బాధ్యతలు, ఆలయ పనులను సైతం పుదుచ్చేరి హిందూ రిలీజియస్ ఇనిస్టిట్యూట్, ఎండోమెంట్ శాఖ తీసుకోవాలని ఆదేశించారు. ఈ తీర్పును స్వాగతిస్తున్నట్లు నాయకులు పెసల వెంకటేష్, పవన ప్రసాద్, హరి ప్రసాద్ తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ఐ.పోలవరం: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత శిబిరాన్ని గ్రామ సర్పంచ్ దంతులూరి వెంకట రాఘవరాజు ప్రారంభించారు. వైద్యులు ప్రసాద్, బోసు, దుర్గాదేవిలు సుమారు 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి గోవిందరావు, విత్తనాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

అల్లవరం: కొమరగిరిపట్నం అడవిపల్ర వద్ద అదే గ్రామానికి చెందిన శాంతినగర్ వాసి ఉండ్రాజరపు తాతయ్య (83) మృతదేహాన్ని అల్లవరం పోలీసులు గుర్తించారు. అతను మతిస్థిమితం లేక బాధపడుతున్నాడు. అనారోగ్యం, ఎండ తీవ్రత, వృద్ధాప్యం కారణాలతో మూడు రోజుల కిందట అక్కడ మరణించాడని పోలీసుల దర్యాప్తులో తేలింది. తాతయ్య మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని ఏఎస్ఐ జంగా సత్యనారాయణ తెలిపారు.

ఎంపీని కలసిన ఏఎంసీ చైర్మన్



గుబ్బల రోజారమణి దంపతులను సత్కరిస్తున్న ఎంపీ అనురాధ

అల్లవరం: ఇటీవల రాజోలు ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన గుబ్బల రోజారమణి మనోహర్ శుక్రవారం అమలాపురం ఎంపీ చింతా అనురాధను మర్యాద పూర్వకంగా కలిశారు. మొగళ్లమూరులోని ఎంపీ కార్యాలయం వద్ద అనురాధను కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ దంపతులను ఎంపీ సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, కంచర్ల శేఖర్, సూరిశెట్టి బాబి, గుబ్బల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

16న మండల పరిషత్ సమావేశం

తాళ్లరేవు: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 16వ తేదీ గురువారం మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ ఎం.అనుపమ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

వ్యాపార దృక్పథంపై అవగాహన

అల్లవరం: ఓడలరేవులోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఐఐసీ ఆధ్వర్యంలో యువత నూతన వ్యాపార దృక్పథాలపై అవగాహన సదస్సు జరిగింది. బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ కె.శ్రీకర్ శుక్రవారం వ్యాపార రంగంలో అభివృద్ధి చెందడానికి ఉన్న అవకాశాలను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ చంద్రమౌళి, ఎ.రామకృష్ణ, కేబీఎస్‌డీ శర్మ తదితరులు పాల్గొన్నారు.